క్లుప్తంగా

సార్వత్రిక ఎన్నికలకు పటిష్ట చర్యలు



ఎస్పీ ప్రశాంతికి పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎస్పీ లక్ష్మయ్య

ఏలూరు టౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకొనేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అన్నారు. నూజివీడు డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన గోలి లక్ష్మయ్య ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ నూజివీడు సబ్ డివిజన్ ప్రధానంగా అంతర్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలతో కలుస్తూ ఉన్న నేపథ్యంలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోకి ఇతర రాష్ట్రాల నుంచి మద్యం, నాటుసారా అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. నిత్యం వాహన తనిఖీలు చేస్తూ నగదు అక్రమ రవాణాను అడ్డుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అశోక్ నగర్ కేవీ సబ్ స్టేషన్ పరిధి ఆర్టీసీ ఫీడర్‌లో చెట్ల కొమ్మల తొలగింపు, వార్షిక మరమ్మతుల నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ సంస్థ ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలీస్ లైన్స్, కొత్త బస్టాండు ప్రాంతం, ఆర్‌పీ రామారావు వీధి, డాక్టర్ సత్యనారాయణ వీధి, గ్రాండ్ ఆర్య రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఎంపీ గొల్ల బాబూరావుని కలిసిన ఏసుబాబు



మంగళగిరిలో రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబు రావును కలిసిన కట్టా ఏసుబాబు

దెందులూరు: దెందులూరు మండలం కొవ్వలికి చెందిన సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబురావు రాజ్యసభ సభ్యుడిగా ఎంపిక కావడం కొవ్వలికి, దెందులూరు మండలానికి బడుగు, బలహీన వర్గాలకు గర్వకారణమని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు అన్నారు. మంగళవారం ముఖ్యమంత్రి కార్యాలయంలో ఎంపీ గొల్ల బాబూరావును ఏసుబాబు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ట్రాక్టరు తిరగబడిన ప్రమాదంలో డ్రైవరు మృతి

ఉంగుటూరు: జాతీయ రహదారిపై చేబ్రోలు–కైకరం గ్రామాల మధ్య ట్రాక్టరు డివైడరును ఢీకొని తిరగబడిన ప్రమాదంలో మనెల్లి నాగరాజు (30)చనిపోయాడు. సోమవారం తణుకు మండలం దువ్వనుంచి ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడు గ్రామానికి ట్రాక్టరు లోడుతో వెళుతుండగా చేబ్రోలు దాటి కైకరం వస్తుండగా ఇంజన్ కుడివైపు చక్రం పేలిపోవడంతో వాహనం అదుపుతప్పి డివైడరును ఢీకొని తిరగబడింది. ఈ ప్రమాదంలో డ్రైవరు నాగరాజు అదే ట్రాక్టరు కిందపడి తీవ్రంగా గాయాలపాలయ్యాడు. హుటాహుటిన ఎస్సై మణికుమార్, పోలీసులు ఘటనా ప్రదేశానికి వచ్చి క్షతగాత్రుడికి సపర్యలుచేసి వెంటనే ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నాగరాజు చనిపోవడంతో ఎస్సై మణికుమార్ కేసు నమోదుచేశారు. పోస్టు మార్టం తరువాత మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. నాగరాజు తండ్రి ఏసు, కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.

తుది దశకు కైకలూరు రోడ్డు నిర్మాణం

- రూ.20.72 కోట్లతో పనులు, 90 శాతం పూర్తి
- 29న గురుకులపేట వద్ద వంతెన ప్రారంభం



మాదేపల్లి వద్ద నిర్మించిన కైకులూరు రోడ్డు



శ్రీపర్రు కాజ్‌వే వద్ద నిర్మించిన వంతెన

ఏలూరు రూరల్: ఏలూరు మండలం దెందులూరు నియోజకవర్గం పరిధిలోని కైకులూరు రోడ్డు అభివృద్ధి కల సాకారమౌతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.20.72 కోట్ల రూపాయలతో చేపట్టిన రోడ్డు పనులు 90 శాతం పూర్తయ్యాయి. 40 ఏళ్లకుపైగా మాదేపల్లి, గురుకులపేట, శ్రీపర్రు, మానూరు, మహేశ్వపురం, కలకుర్రుతో పాటు కైకులూరు ప్రజల ఎదురు చూసిన గురుకులపేట వద్ద కొత్త వంతెన సైతం పూర్తయింది. ఈ వంతెనను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఈ 29న ప్రారంభించనున్నారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి గ్రామం నుంచి మహేశ్వరపురం శివారు వరకు సుమారు ఏడు కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణం రూ.20.72 కోట్ల వ్యయంతో చేపట్టారు. శ్రీపర్రు గ్రామం వద్ద సీసీ రోడ్డు నిర్మించారు. మహేశ్వరపురం శివారున బురదనేల వద్ద రోడ్డు కోతకు గురికాకుండా రివెంట్‌మెంట్ నిర్మించారు. రోడ్డుకు అటు ఇటుగా సాగునీరు పారుదలకు రోడ్డు కింద కల్వర్టులు ఏర్పాటు చేశారు. దాదాపు 90 శాతం పనులు పూర్తికాగా, మరో 3 కిలో మీటర్ల మేర రోడ్డు పూర్తికావాల్సి ఉంది.

గత ప్రభుత్వ హామీ బుట్టదాఖలు

గత ప్రభుత్వంలో కైకలూరు రోడ్డు గోతులమయంగా మారడంతో రాకపోకలకు వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. గురుకులపేట తమ్మిలేరు వద్ద కాజ్‌వేపై వాహనాలు ప్రమాదానికి గురయ్యేవి. దీంతో పలువురు మృత్యువాత పడ్డారు. వరద సమయంలో కాజ్‌వే నీట మునిగి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యాయి. రోడ్డు అభివృద్ధి చేయాలని, కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చేశారు. నాటి టీడీపీ మంత్రి పీతల సుజాత, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఈ వంతెన, రోడ్డు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చి చేతులు దులుపుకున్నారు.

జగన్, కొఠారులకు కృతజ్ఞతలు



వంతెన, రోడ్డు నిర్మించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికీ మా ఊరు ప్రజలు రుణపడి ఉన్నారు. గోతుల రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. గత ప్రభుత్వ హయాంలో తమ్మిలేరుకు వరద వస్తే మా ఊరు ప్రజలు నానా అగచాట్లు పడేవారు. కాజ్‌వే నుంచి మనిషి కూడా దాటలేని పరిస్థితి. టీడీపీ నేతలకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. ఇప్పుడు ప్రయాణికులు కొత్త వంతెన నుంచి సాఫీగా రాకపోకలు సాగిస్తున్నారు.

– సైదు భాగ్యలక్ష్మి, శ్రీపర్రు సర్పంచ్

రూ.2 కోట్లతో మా ఊళ్లో అభివృద్ధి



కైకులూరు రోడ్డు మా ఊరు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. నిత్యం ఈ రోడ్డు మీదుగా మేం ప్రయాణించాలి. ప్రభుత్వం మంచి పని చేసింది. గత ప్రభుత్వం మా ఊరు అభివృద్ధి కోసం పైసా కూడా ఖర్చు చేయలేదు. ఎమ్మెల్యే అబ్బాచౌదరి కృషితో మా ఊరులో రూ.2కోట్ల అభివృద్ధి పనులు చేశారు. సచివాలయం, హెల్త్ క్లినిక్, సీసీ రోడ్లు, తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటుచేశారు. గత పాలకులకు సమస్యలను పట్టించుకోలేదు. శంకుస్థాపనలు చేసి చేతులు దులుపుకున్నారు.

– బలే నాగరాజు, పెదయాగనమిల్లి, పెద్ద

పాఠశాలల అభివృద్ధికి నిధుల జమ



పనుల ప్రగతిపై అధికారులకు సూచనలిస్తున్న సోమశేఖరరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఒక్కో మండలానికి రూ.50 లక్షలకు పైగా నిధులు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జమ చేసిందని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి.సోమశేఖరరావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు – నేడు పనుల ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్ఓ వాటర్ ప్యూరీఫయర్, తరగతి గదుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి తగిన ఆదేశాలిచ్చారు. కళాశాల ప్రాంగణంలో ఉన్న మెటల్ చిప్స్, ఐరన్ రాడ్‌లను జాగ్రత్త చేయాలన్నారు. స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్ నిధులు అన్ని పాఠశాలల్లో, కళాశాలల్లో ఉన్నాయని, వాటితో పాఠశాలలో మరమ్మతు పనులు వచ్చే వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా సంఘాల లీడర్లు

ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి

ఏలూరు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. మంగళవారం ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలో నాలుగో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించారు. 15 గ్రామాల నుంచి సుమారు ఐదు వేల మంది మహిళలు హాజరయ్యారు. ఇచ్చిన మాటకు కట్టుబడి డ్వాక్రా సంఘాలకు ఆర్థిక చేయూత ఇచ్చిన జగన్‌కే మా ఓటు అంటూ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో చంద్రబాబు డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ చేస్తానని నమ్మించి, అప్పులు పాలు చేశాడని విమర్శించారు. 2019 ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం జగన్ వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఏలూరు రూరల్ మండల డ్వాక్రా సంఘాల సభ్యులకు నాలుగు విడతల్లో రూ.19.94 కోట్లు అందించారని వివరించారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని మహిళలను కోరారు. సంక్షేమ పథకాలు అమలు కావాలంటే జగన్‌ను రెండోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో సంక్షేమ పథకాలతో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని వివరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జగన్ పాలనను మరోసారి తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి దెందులూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి బాట పట్టించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, ఏపీఎం ప్రభావతి, రాష్ట్ర వడ్డి కార్పొరేషన్ చైర్మన్ మంగర సంజీవ్‌కుమార్, డైరెక్టర్ మండల కొండలరావు, ఘంటా ప్రసాద్, పార్టీ మండలాధ్యక్షుడు తేరా ఆనంద్, సీనియర్ నాయకుడు పీవీరావు, జాలిపూడి సొసైటీ చైర్మన్ బొల్లిముంత రాము, సర్పంచ్ శ్రీరామ్ ప్రభుదేవ్, ఉపసర్పంచ్ నరహరశెట్టి రాధాకృష్ణ, మానుకొండ సాయిబాబా, తిరుపతిస్వామి, పంపుల శ్రీను, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరయ్యారు.

సంతృప్తి నిచ్చిన ప్రజా సేవ

ఎంపీ కోటగిరి శ్రీధర్



ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను సత్కరించిన దృశ్యం

ఏలూరు(మెట్రో): ఏలూరు పార్లమెంట్ సభ్యుడి పదవీ కాలం ఎంతో సంతృప్తినిచ్చిందని ఎంపీ కోటగిరి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం దిశ సమావేశం అనంతరం ఎంపీ శ్రీధర్‌ను జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీధర్ మాట్లాడుతూ ఈ రోజు జరిగిన సమావేశంలో అజెండాలోని అన్ని అంశాలను సమీక్షించడం సంతృప్తినిచ్చిందన్నారు. ఎంపీ హోదాలో ఇది ఆఖరి సమావేశంగా బావిస్తున్నానని, ఐదేళ్లుగా పార్లమెంట్ సభ్యునిగా, రాజకీయవాదినిగా ప్రజలకు అందించిన సర్వీసు తనకు సంతృప్తి ఇచ్చిందని చెప్పారు. తన పదవీకాలం ముగింపుతో బయటకొస్తున్నానన్నారు. ప్రజలకు అన్ని విధాలా మేలు చేయాలని అధికారులకు సూచించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి మన్ననలు పొందేలా ఎంపీ శ్రీధర్ సేవలు అందించారన్నారు. రైల్వే అంశాలకు సంబంధించి పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. ప్రజాదరణ గల ఎంపీ శ్రీధర్ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఎంపీ శ్రీధర్ సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. అధికారులపై ఒత్తిడి లేకుండా ప్రజా ప్రయోజన పనులను సమర్థవంతంగా ముందుకు తీసుకువెళ్లారని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కేఎస్ఎస్ సుబ్బారావు, దిశ కమిటీ సభ్యులు ఉంగుటూరు ఎంపీపీ ఘంటా శ్రీలక్ష్మి, చింతలపూడి ఎంపీపీ బి.రాంబాబు, కైకలూరు సర్పంచ్ వి.వసంతకుమారి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



తాడేపల్లిలో మేము సిద్ధం సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే వాసుబాబు, నాయకులు

గణపవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అమలు చేసిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తే వైనాట్ 175 నినాదం నిజమవుతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసినట్లు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు తెలిపారు. తాడేపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పార్టీ నాయకులకు నిర్వహించిన సమావేశానికి హాజరైన ఉంగుటూరు నియోజకవర్గ నాయకులతో కలిసి వాసుబాబు హాజరయ్యారు. ఈసందర్భంగా వాసుబాబు విలేకరులతో ఫోన్‌లో మాట్లాడుతూ ఎంతో ఉల్లాసంగా జరిగిన ఈసమావేశంలో ముఖ్యమంత్రి పార్టీ శ్రేణులకు ఇచ్చిన సూచనలు ప్రతి కార్యకర్త పాటించాలన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పార్టీ కన్వీనర్లు,జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సచివాలయ గృహసారథులు మేము సిద్ధం ప్లకార్డులు చేతపట్టి సీఎం జగన్‌ను కలిసినట్లు చెప్పారు. జగన్ తమను భుజం తట్టి ప్రోత్సహించారని పార్టీ నాయకులు తెలిపారు.

'మేము సిద్ధం' సభకు హాజరైన పార్టీ శ్రేణులు

నిడమర్రు: మంగళగిరిలో మంగళవారం సార్వత్రిక ఎన్నికల సమాయత్తంలో భాగంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించన మేము సిద్ధం– మా పోలింగ్ బూత్ సిద్ధం సభకు నిడమర్రు మండలం నుంచి ముఖ్య నేతలు హాజరయ్యారు. వీరిలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ కోడే కాశి, పార్టీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ నౌడు అచ్యుతరామారావు ఉన్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ కోడే కాశి మాట్లాడుతూ వచ్చే 45 రోజులు కీలకమని ప్రతి కార్యకర్త వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని సీఎం జగన్ సూచించారని అన్నారు. ప్రజలంతా సంక్షేమ పాలనకు మద్దతు తెలిపేలా వైఎస్సార్ సీపీ శ్రేణులు కృషి చెయ్యాలని, ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలని సీఎం జగన్ ఆదేశించారని అన్నారు. ఈ సమావేశం పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపిందని మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ అన్నారు.

సమస్యలపై ఉపాధ్యాయుల వినతి



డీఈఓ అబ్రహాంకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో ఉపాధ్యాయుల సమస్యలు, పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోరుతూ యూటీఎఫ్ ఏలూరు జిల్లా శాఖ నాయకులు డీఈఓ ఎస్ అబ్రహాంకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఎస్ఎస్‌సీ పరీక్షల విధుల నుంచి అనారోగ్యం ఉన్నవారికి, పదవీ విరమణ చేయనున్న వారికి, గర్భిణులు, బాలింతలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. సింగిల్ రూమ్ డిస్మాండిల్ స్కూల్స్‌కు నిధులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. ద్వారకాతిరుమల మండలం సంద్రగుంట ఎయిడెడ్ పాఠశాల, ఎంపీపీ మెట్ట వంగిడిగూడెం ఎంటీఎస్ టీచర్, సీహెచ్ పోతేపల్లి యూపీ పాఠశాలలో ఎస్ఏ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై నియమించాలని కోరారు. ఈ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని డీఈఓ హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫా అలీ రుద్రాక్ష రవికుమార్ సంఘనాయకులు బి.సుభాషిణి, ఎంవీ శ్యాంబాబు, జీవీ రంగమోహన్, పీవీ నరసింహారావు, ఈ.శివశంకర్, కె.కమల్ కుమార్, బి.మోహనరావు, తేరా ప్రసాద్, కేవీ అప్పారావు, జొన్నకూటి రాజారావు, కోరాడ కిరణ్ కుమార్, మరీదు లక్ష్మణరావు ఉన్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి



బిషప్ జయరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సమాజంలో ప్రతి వ్యక్తీ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని అప్పుడే లోక కళ్యాణం, విశ్వశాంతి సాధ్యపడుతుందని ఏలూరు కథోలిక పీఠం బిషప్ పొలిమేర జయరావు పిలుపునిచ్చారు. ఆయనకు విశాఖపట్నం పీఠానికి పరిపాలనాధికారిగా అదనపు బాధ్యతలను ఇటీవల పోప్ ఫ్రాన్సిస్ అప్పగించిన సందర్భంగా పలు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు మంగళవారం జయరావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఏలూరు పీఠంతో పాటు విశాఖ పీఠం కూడా జయరావు పరిపాలనలో ఆధ్యాత్మికంగా మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జయరావు మాట్లాడుతూ సమాజంలో అట్టడుగున ఉన్నవారిని ఆదుకోవడానికి సేవే పరమావధి అని, సేవా మార్గంలో నడిచే వారు భగవంతుని నేరుగా చేరుకుంటారని తెలిపారు. విశాఖపీఠం నుంచి ఆయా ప్రాంతాల అభివృద్ధికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం జయరావును క్రైస్తవ సంఘాల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అమలోద్భవి కథీడ్రల్ విచారణ గురువు ఫాదర్ మైఖేల్ ఇంజమాల, తోట ఎడ్వర్డ్, చట్టుబాల ప్రణయ్ బాబు, సిద్ధనూరి కళ్యాణం, మెండెం రాజు, కలపర్తి శ్రీను, పుల్లా ఆదాము తదితరులు పాల్గొన్నారు.

'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం'



మేము సిద్ధం - మా బూత్ సిద్ధం వాల్‌పోస్టర్లన్‌ను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి

దెందులూరు: మేము సిద్ధం– మా బూత్ సిద్ధం కార్యక్రమానికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులతో కలిసి మంగళవారం హాజరయ్యారు. ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మేము సిద్ధం– మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా దెందులూరు నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాద్, దెందులూరు ఏఎంసీ చైర్మన్అప్పన ప్రసాద్, పార్టీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, నాయకులు బొద్దు సతీష్, కొట్టు విశాల్, అక్కినేని గోపి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మేము సిద్ధం – మా బూత్ సిద్ధం వాల్‌పోస్టర్లను ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి నాయకులతో కలిసి ప్రదర్శించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి



టైలరింగ్ షాప్‌ను ప్రారంభిస్తున్న ఇమ్మానియేల్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మహిళలు ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ బి.ఇమ్మానియేల్ అన్నారు. మంగళవారం స్థానిక వంగాయగూడెంలో టి.సునీత అనే మహిళ ఏర్పాటుచేసిన టైలరింగ్ షాప్‌ను ఆయన ప్రారంభించారు. టైలరింగ్ షాపు ఏర్పాటుకు పీఎంఈజీపీ పథకం ద్వారా సునీతకు రూ.8 లక్షల రుణం 35 శాతం సబ్సిడీతో అందించారని అన్నారు. ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజర్ ఇమ్రాన్ మొహమ్మద్, మెప్మా సీఎంఎం కె.సుధాకరరావు పాల్గొన్నారు.

స్వామి వారికి పట్టు వస్త్రాల సమర్పణ

దెందులూరు: జోగన్నపాలెంలోని బాలా త్రిపుర సుందరీ సమేత యోగలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి జోగన్నపాలెం కోఆపరేటివ్ సొసైటీ మాజీ చైర్మన్ ఆలూరి గోవిందరావు పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. బుధవారం ఆలయంలో ఆలయ ధ్వజ, శిఖర, చండేశ్వర, కాలభైరవ, ద్వారపాలక, జంట నాగుల విగ్రహాల పునఃప్రతిష్ఠ ఉదయం 10.2 గంటలకు నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ తెలిపారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	33
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.30	45
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	28

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	19
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	04
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	27
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	28
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34